జీనియస్సులు. (కాని వాళ్ళే కత్తుల సుబ్బారావులై పోతారు) కవులుగాని. సంగీత విద్వాంసులుకాని చిత్రకారులుగాని ఎవరైనా కొంత మంది అసలు సరుకున్నవాళ్ళలా కనిపించరు. బైతుల్లాగుండి లోకాన్ని బోల్తా కొట్టిస్తారు. ఎందుకూ పనికిరాని టప్పెన్స్‌గాళ్ళు మాత్రం హేచ్ ఈ హెచ్ ల్లాను, హెచ్ ఈ ల్లాను పోజులు పెడుతూంటారు.

అయితే యింత గ్రంథం ఎందుకు పెరిగిందంటే వంగతోటలోనే వాడిన మాటలకన్నిటికీ వూకొట్టి నాకొక గుణపాఠం నేర్పారు మాయింటి మహారాజా. మావారు ఫ్యూడల్ లార్డ్ కారనుకోండి. నాస్తికులై తేమటుకు శ్రీవారు అనడం మానేసారా? పరుపులూ దిళ్ళూ పందిరి మంచం బూర్జువా కల్చర్ అనిచెప్పి క్రిందపడుకోవడం లేదెవ్వరూ (లేకపోతేతప్ప) మహారాజ రాజశ్రీ అన్నా చిరంజీవి సౌభాగ్యవతి అన్నా మీరు నన్ను తప్పుపట్టకూడదు. కొన్ని పిలుపులు. మర్యాదలు సరదాలు అలానే అట్టే పెట్టుకోవడం బెష్టు. సన్న బియ్యపన్నం, నేతిపోపులూ, బూరెలూ గారెలూ, అరిసెలూ, అప్పడాలూ, మజ్జిగపులుసూ, దప్పళ్ళం యివంటే ఎంతిష్టమో నాకు మావారిని మహారాజు అని పిల్చుకోవడం కూడా అంతే యిష్టం. నా చతురంబోధి పరీత భూవలయ ప్రణయమనో సామ్రాజ్యానికి ఏకైక లార్డ్ - ఐయామ్ హిజ్ మాస్టర్స్ వాయిస్! బట్, నీకు గ్రామఫోన్‌కి టెలిఫోన్‌కి తేడా తెల్సా అని మావారు నన్ను వెక్కిరించబట్టి యింత గ్రంథం పెరిగింది. ఎక్కడైనా బావగాని వంగతోట్లో బావగాదు . ఆమాట నిజమే- మనం రాణీలా కబుర్లు చెప్పాలంటే మనపార్ట్ నర్ పురుషోత్తముడు కాకతప్పదు. పురుష ద్వేషిణులు ఈ రహస్యమును గమనింతురుగాక! ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః!

# ఎవరింట్లో పూస్తేనేం?

**మా** ఇల్లు బొమ్మరిల్లు, మా సంసారం లిక్కి సంసారమూను. ఇరవై ఏళ్ళ క్రితం ఇండిపెండెంట్‌గా మేం కాపరం పెట్టిన కొత్తలో - అప్పటికి మావారికింకా సార్వభౌమాధికారాలు సంక్రమించలేదు. మాది డొమినియన్‌స్టేటస్... చిన్న గుండుపప్పు గిన్నెకొనమంటే, అవసరమో కాదో అమ్మకు ఉత్తరం రాసి కనుక్కుంటాను అనేవారు మా గుర్నూగారు. మేం సంసారం పెట్టిన ఎర్లీడేస్‌లో అంటే ట్వంటీ ఏళ్ళక్రితం రేకుగిన్నెలో తలగొట్టి తవ్వెడు బియ్యం అత్తెసరు కుంపటిమీద పడేస్తే అది మా ఇద్దరికీ ఎక్కితక్కిఅయి తినలేక గుడ్లు తేలేసేవాళ్ళం.

మా కిద్దరికీ ఓ పూటకు సరిపడే కూర అల్లం పచ్చిమిరపకాయలు అండ్ ఆల్సో ఉల్లిపాయలు మావారు కొని ప్యాంటు జేబులో పోసుకొచ్చే వారు. ఇప్పుడు మా ఇంట్లో కూరల్సంచీ అప్పుడు మాకు బియ్యపు సంచి ఇన్ దోజ్ డేస్. పావలాపెట్టి పకోడీలు మిఠాయి కొమ్ములు రెగ్యులర్‌గా

తెచ్చేవారు. బాత్‌రూంలోంచి వచ్చే వాటర్ వేస్టవకుండా అక్కడో చిన్న సన్నజాజి పందిరి ఒకమల్లె అంటు, ఒక గులాబి మొక్కావేసి జాగ్రత్తగా పెంచాను. బియ్యం కడుగు. మేక పెంటికలు ఏరుకొచ్చి వేసి అక్కడే కూర్చునే దాన్ని అవి ఎప్పుడు మొగ్గ తొడుగుతాయా, పూస్తాయా అని ఆలోచిస్తూ, చిన్న మొగ్గవేస్తే, ఏ గులాబీ చెట్టేనా పూస్తే, పందిరిమీదకు సన్నజాజి తీగలు బిలి బిలి మండలలే ప్రాకుతూంటే నాకెంతో సంతోషంగాను, గొప్పగానూ వుండేది. నేనా మొక్కలకు తాళ్లుకట్టి, చిన్నకర్ర ముక్కలతో సపోర్టులు పెట్టిచుట్టూ బోదెలుచేసి ఆ కాస్త జాగాలో నందనోద్యావనాన్ని సృష్టించుకుని మురిసిపోయేదాన్ని. నా తన్మయత్వం నా మురిపాన్ని చూసి మా వారు నేనో క్రాక్ ననుకున్నారు. డామిట్! మొక్కల సంగతి మీకు తెలీత్తెలీదు - అవి నా ఫ్రెండ్సు అని డబాయించే దాన్ని. ఒక అణా పెట్టి రోజూ పూలు కొనుక్కోరాదా అనేవారు. మా వారు. కొంచెం బ్రూట్ - నేను నా మొక్కలతో మాట్లాడుతూ కూర్చునే దాన్ని. అవి నా మాటల్ని వింటూన్నట్లు గాలికి కదుల్తూ నాతో ఆడుకునేవి. ముండల్లారా దాహం వేస్తోందా అని నీళ్లుపోసి కొమ్మల్నీ, రెమ్మల్నీ ఆకుల్ని సర్ది పోట్లాడుకోవద్దని చెప్పినాకు తెలిసిన పిచ్చి పాటలన్నీ పాడి వాటికి వినిపించేదాన్ని. అవి నా మాటలకు తల వూపినట్లే నా పాటలకు కూడా తలవూపేవి నా పాత ఉత్తరాలన్నీ ఆ మొక్కల దగ్గర చాపేసుకుని కూర్చుని చదువుకునేదాన్ని. ఆ ఉత్తరాల్లోని సంగతులన్నీ బహుశా వాటికి తెలుసు. నన్నోసారి మావారో లెంపకాయ కొడితే నేనక్కడే కూర్చుని ఏడిచాను. వాటిని చూసి నేను మౌనంగా గంభీరంగా వుండటం కూడా నేర్చుకున్నాను. వాటిని చూసే సంసారాన్ని పచ్చగా కలకల లాడుతున్నట్లు తీర్చిదిద్దుకోవడం కూడా నేను నేర్చుకున్నాను.

ఓ పక్క కుర్రతనం ఆ కుర్రతనానికి సరిపడని భయంకరమైన ఒంటరితనం - ఒంటరితనానికి తోడై చిలిపి వూహలు నన్ను బాధించకుండా నేను మొక్కలతో కాలక్షేపం చేసేదాన్ని. మా ఇంట్లో ఒక పిచిక ఫామిలీ ఉండేది. మధ్యాహ్నం వంటిల్లు కడిగేసి గదిలో మంచంమీద వెల్లికిలా పడుకుని పిచిక సంసారం గురించి స్టడీ చేస్తూండేదాన్ని. అవి కిచకిచమని కబుర్లు చెప్పుకుంటూ హడావిడి చేస్తూ గదంతా తిరిగేవి. కిటికీల్లోంచి బయటకు వెళ్ళి మళ్ళీ ముక్కున ఏదో కర్చుకుని వస్తూ యమబిజీగా వుండేవి. అవి మాట్లాడుకోవటం నా గురించీ మావారి గురించేమోనని నాకు లోపలడవుటుగా వుండేది. తెలుసుకుందామంటే పిచిక భాష రాదుగదా.

బట్టలు ఉతుక్కుని వాటిని ఆరేసుకునే వేళకు దండాలమీదవచ్చి వ్రాలేవి బోల్డుకాకులు. కాకులు ఆడాళ్ళను అట్టే కేర్ చేయవు. ఓపక్కకు మొగంపెట్టి దొంగరాస్కెల్సు మల్లే అని నాకేసి చూసేవి. రవుడీ కాకుల్లారా పొండర్రా పొండి అని తడిబట్టలు పిండి ఆరేస్తూ వాటిని కసిరే దాన్ని. అవి అటూ యిటూ ఎగురుతూ ఎంగిలి కంచాలు కడిగినచోట పారేసిన మెతుకుల కోసం కూరముక్కల కోసం బాత్రూంలో మర్చిపోయిన సబ్బుబిళ్ళల కోసం నేతి చెంచాకోసం నేతి గరిట కోసం నన్ను ఏడిపించుకుని తినేవి. అప్పుడప్పుడు చుట్టాలల్లే మా ఎదురు గోడమీదకు

కోతులొచ్చేవి. కోతులు వస్తే తలుపులు బిగించుకుని గదిలోకి పోయి ఇల్లు సర్దుకుంటూనో, లేసు అల్లుకుంటూనో కిటికీ దగ్గర స్టూలు వేసుకుని కూర్చునే దాన్ని, అవి నాకేసి చూసి పళ్లికిలించి పెంకుల్ని యిటూ అటూ తిరిగేసి చేతి కందినవి పట్టుకుపోయి నానాఅల్లరి చేసేవి. కథల పుస్తకాలుచదివే ఓపిక కూడా నాకుండేది కాదు. బాగారాసినవి తెలిసి చచ్చేవి కావు బాగా రాయనివి మనసుకు నచ్చేవికావు. మావారు ఆఫీసొదలంగానే యింటికి రాకూడదా, వచ్చి నాకు కంపెనీ యివ్వకూడదా అనిపించేది. దెబ్బలాడి మా వూరెళ్లి పోతే బావుండ్ననిపించేది. కాని ఒకరోజు పోట్లాట వేసుకున్నా మళ్ళీ మర్నాడు పోట్లాడేందుకు ఎవరూ ఉండరు కదా? ఎలా తోస్తుందీ అన్న దవుతుండేది. అదీగాక మావూళ్ళో నా వయస్సు అమ్మాయి లందరూ కాపరాల కెళ్ళిపోయుంటారు కదా! అక్కడ కూడా దిక్కుమాలిన ఒంటరితనమే ఎదురయేటప్పుడు యిక్కడే నోరు మూసుకు పడుండడం మేలనిపించేది.

ఈ మంచం ఆ మూలకులాగి ఆ కుర్చీ యీ మూలకులాగీ బల్లలు సర్ది గిన్నెలు తుడిచీ అలమార్లు సర్ది ఎంతకీ కాలక్షేపం కాక చివరకు మొక్కలతో ఫ్రెండ్‌షిప్ పెట్టుకున్నాను. ముందు మురికిగా తడిగా చెత్తచెత్తగా వున్న జాగాను శుభ్రంచేసి చిన్న చిన్న సైడ్ కెనాల్స్ తవ్విఅక్కడ నీరు నిలచిపోకుండా పెంకులతో, రాళ్ళతో సైడ్‌వాల్స్ తూములు, డాములు, ఆనకట్టలు కట్టి ఆల్మోస్ట్ ఆడుకునేదాన్ని, మట్టితో నీళ్ళతో ఆడుకోవటం నాకుచిన్నప్పట్నుంచీ అలవాటే – నేను మొక్కల్నీ మొటికల్నీ పెంచటం వచ్చాక రోజూ శ్రీవారితో దెబ్బలాటే – ఆయన్ని నా మొక్కల దగ్గర మొహం కడుక్కో నిచ్చేదాన్ని కాను. ఆ ఎస్టేటంతా నాది అక్కడి ఉమ్ములేసినా, పళ్ళు తోముకుని గలీజు చేసినా వూరుకునేదాన్ని కాదు. బ్రహ్మరాక్షసిలా మీదపడిపోతా వేమని విసుక్కునేవారు. నేను మళ్లీ పుట్టింటి కెళ్ళాల్సిన యమర్జన్సీ ఓటొచ్చి పడింది. అప్పుడు మొక్కల్ని జాగ్రత్తగా చూడండని శ్రీవారికి పదేపదే చెప్పాను. విసుక్కున్నారేమో నేను మళ్ళీ ఆరేడునెల్లు పుట్టింట్లో బైఠాయించి మా కులదీపాన్ని ఎత్తుకుని వచ్చేసరికి యిల్లు మార్చేశారు. కొత్త యింట్లోకి మారటం అట్టే సుఖమైన డైవర్షన్‌కాదు. నా మొక్కల గురించి ఏం చేశారని మావార్నడిగాను. ఇంటివారమ్మాయిలు ముచ్చటపడితే యిచ్చేశానన్నారు. నాకేడుపొచ్చినంత పనైంది. ఇంటివారమ్మాయి కెన్నేళ్ళు అని కన్నీళ్లు నాపుకుంటూ అడిగాను. వాళ్ళ సరోజ నెరగవూ బియస్సీ మూడుమాట్లు తప్పింది ఆ పిల్లే వచ్చి అడిగి పట్టుకుపోయింది ఇప్పీహీ అన్నారు. దీని బియస్సీ తెలివితేటలు తగలెయ్యా... నేనుండగా రాలేదు, వస్తే కాళ్ళమీద చేతుల మీదా వాతలు పెట్టేద్దును అనుకున్నాను. మావారన్నారుగదా? యిప్పుడు మనం కాళీచేశాక దొడ్డంతా సిమెంట్ గచ్చు చేసేశారు. నువ్ పాపం మట్టితో, గలీజుతో నానా అవస్థా పడేదానివి, దొడ్డి అంతా చితపతలాడుతూ వుండేది అని.

నా గుండెలమీద ఎవరో సిమెంటుతో గచ్చు చేసినట్లనిపించింది, నా పిచ్చి ముండలు సన్నజాజీ గులాబీ మల్లె అంట్లు ఎలా వున్నాయో కదా అని నాచేత్తో పెంచిన మొక్కల్ని, ఆ బియస్సీ తప్పిన దిబ్బ మొహం దానికి దానం చేసిన మావారి చవటతనానికి నాకు వొళ్ళు

మండుకు పోయేది, వాటికి నీళ్లు పోసి పెంచారనుకున్నారా ఏవిటి? నే పాటలుపాడి కబుర్లుచెప్పి వాటిని సాకాను. ఎవరైతే మటుకు దొడ్డంతా గచ్చు చేయగల్రుగాని నా మనసులోని జ్ఞాపకాలను సిమెంటుపోసి గచ్చు చేయలేరు గదా! అసందర్భపు మనుషులింట్లో వున్నప్పుడు అటువంటి మమకారాలను ఇక ముందెన్నడూ పెట్టుకోదల్చుకోలేదు. ఎవరింట్లో పూస్తేనేం- అని నేను పెంచిన గులాబీ, సన్నజాజి మల్లె మాలతులు కదా! ప్చ్!

# టెల్గుమేనర్స్...కష్టమ్స్

శ్రీ కృష్ణ పరబ్రహ్మణే నమః అన్నా, మాదా కబళం తల్లీ అన్నా ఒకటే అర్థం. రమా రమణ గోవిందో హారి అన్నా, ఇందిరా రమణ గోవిందోహారి అన్నా సేమ్మీనింగు. సూరదాస్‌కో ఏక్ పైసా దేదో అంటాడు ఉత్తర హిందూస్థాన్‌లో కళ్లు లేని కబోది. శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః అమ్మా ఉపాదానం తల్లీ అంటాడు యాయవారపు బ్రామిన్. యాచక వృత్తి అంటే అడుక్కోవటమైనా దానికొక డిగ్నిటీ ఎటికేట్ వుంది. నువ్వింత తిను నాకింత పెట్టు అనేదే భారతీయ కల్చర్.

గాడ్ గివజ్ అవర్ డైలీ బ్రెడ్. అన్నంత శుద్ధ వైదీకంగా తెలుగువాడే కాదు, ఏ ఇండియనూ ఎవణ్ణీ అడగడు. బెగ్గింగ్‌కి మన కంట్రీలో సోషల్ అండ్ రిలిజియన్ శాంక్షను వుంది గనుకే రైలుపెట్టెలలోను ఫ్లాటు ఫారములపైన, బస్సు స్టాండులోను యాచకులను ప్రోత్సహించవద్దు అని బోర్డులు కట్టినా పోలీసుల్ని పెట్టి తరిమినా మనం యాచక్స్‌ని ప్రోత్సహించకుండా వుండలేము. పదిమందికింత పెట్టి నువ్వు తిను అన్న థీరీ మన నర నరమ్ముల్లో జీర్ణించిపోయివుంది.

అన్నపూర్ణా భవతీ భిక్షాందేహీ అని ఆది శంకరుడే కాదు. మన వీధుల్లో ముష్టి వాళ్ళు కూడా ఇల్లాళ్లను అన్నపూర్ణమ్మ తల్లీ అని సంభోధిస్తారు. దానం చేయటమంటే భగవదర్పితం శ్రీ కృష్ణార్పణమస్తు అనే సెంటిమెంట్ చాలా బలమైనది. నారాయణ స్వరూపుడైన భగవంతుని దరిద్రనారాయణులలో చూడమని వారికి సంతోషం కలిగిస్తే సర్వాంతర్యామి సంతృప్తుడవుతాడని మనవాళ్ళు నమ్ముతారు. ఆల్‌మెన్ ఆర్ ఈక్వల్ అన్నా సర్వం జగన్నాథం అన్నా ఒకటే గదా!

ముష్టెత్తుకోడానికి ఫ్రీడం వుందికాని ముద్దెట్టుకోడానికి మనకి ఫ్రీడం లేదు. బాహాటంగా లవ్ మేకింగ్‌కి సోషల్ అండ్ రిలిజియన్ శాంక్షన్ లేదు. సినిమావారు ఓపెన్ ఎయిర్ శృంగారం చూపిస్తారంటే అది మనీ మేకింగ్ కాని లవ్‌మేకింగ్ కాదు.

ముష్టెత్తుకోడం విషయంలో ఎంతో మేనర్స్ కల మన భారతీయ కల్చర్ యిప్పుడిప్పుడు మన వారికి బోధపడకుండా అయోమయమైపోతోంది, ఇంగ్లీషు మర్యాదలే మర్యాదలని మనకు